దాదాపు మూడు దశాబ్దముల క్రిందట మా శ్రీమతి మెట్రిక్ క్లాసు టీచరుగా వున్నప్పుడు తన అనుంగు చెల్లెలికి శనాదివారాలు మధ్యాహ్నం వేళ పాఠాలు నూరి పోసేది. నా మరదలి సహాధ్యాయినులిద్దరు ఆ వేళలకు ఇంటికి వచ్చి, ఆ సదవకాశాన్ని వినియోగించుకునేవారు.

## కాలమ్ దాటని కథ

ఒకనాడు మా ఆవిడ రెడీకాకపోగా, వారు సచిత్ర వారపత్రికలలోని కార్టూనులు చూడడముతో కాలము గడిపేరు. వారినెక్కువగా ఆకర్షించిన కార్టూను - రెండు కరెంటు తీగలపైని వేరువేరుగా రెండు గువ్వ పిట్టలు కూర్చున్నట్టు, అందులో ఒకటి ముందుకు వంగినట్టు చిత్రించి, రెండవ పిట్ట పలికినట్టు రాసివుంది.

### కరెంటు తీగలపైన గువ్వ పిట్టలు

"ప్రేమ కలాపాలు ఇంతటితో ఆపండి. ముట్టు కుంటే ఇద్దరి ప్రాణాలకు ముప్పు" అని.

వారిలో ఎలక్ట్రీషియను చెల్లెలు ఆ కార్టూను ముందే బోధపరిపించుకున్నందున దీనర్థము నీకు తెలుసునా అని మరదలిని సవాలు చేసింది. మరదలు తనకు తెలియదని, అక్కగారి నడిగింది. "ఛీ! వాజెమ్మలారా, పుస్తకాలు తెరవక, ఈ సిల్లీ కార్టూను ఎందుకని ఆమె కసిరింది.

తనకింకా అక్షరాభ్యాసము కాకపోయినా, వారితోటే తనూ బొమ్మనుచూసి, వారు చదివిన డైలాగు విన్న మా అమ్మాయి "నాకు తెలుసు. రెండు పిట్టలు ఒకే తీగపై కూర్చుని ముట్టుకున్నా ఫర్వాలేదు. కాని, వేరు వేరు తీగలపై కూర్చుని ముట్టుకుంటే కరెంటు రెండింటికి తగిలి చస్తాయి" అంది.

ఆ ముందు రోజున నేను పిల్లతో షికారుకు వెళ్ళినప్పుడు కరెంటు తీగల నుండి రెండు పిట్టలు చచ్చి, క్రిందకు పడుతువుండగా చూసేము.

"తీగల నుండి జారి పడినా, ఎగిరి పోవచ్చును కదా! క్రిందకు పడి దెబ్బతగిలి చచ్చేయి పాపం!" అని పిల్ల జాలిపడితే, అవి చచ్చిన తరవాతే క్రిందకు పడ్డాయి అని కారణము బోధపరిచేను 'సేఫ్టీ రూల్సు'ను మరికొన్ని టిని జతపరిచి (చిన్న పిల్లలు స్విచ్‌లను ముట్టకూడదు. ముఖ్యంగా స్నానాల గదిలో, ఇత్యాదివి).

ఆ బోధను మా నాలుగేండ్ల చిన్నారి పూర్తిగ అవగాహన చేసుకుని, సమయస్ఫూర్తితో చెప్పగలిగి, "షెబాష్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ కూతురా!" అని మెప్పు పొందడమే కాక, ఇంజనీరు భార్య మేష్టరమ్మగారికి ఆ మాత్రము తెలియదనే అపోహకు అవకాశము తప్పించింది.

—వి.ఆర్. తాతా.

# శ్రావణ మేఘాలు

## వ్యాస రచన పోటీ:

### డయొనోరా పోర్టబుల్ టి.వి. సెట్ మొదటి బహుమతిగా పొందిన రచన:

# మూడు జీవితాలలో తుఫాను

నేనే శాంతినైతే ఏంచేస్తాను, రాఘవ స్థానంలో నేనే వుంటే ఎలా ప్రవర్తిస్తాను అనే విషయాన్ని వర్ణించే ముందు, నవల పేరును గురించి రెండు మాటలు వ్రాయాలని వుంది. ఇతివృత్తానికీ, సంఘటనలకూ ఏమాత్రం సంబంధం లేని పేర్లు గల నవలలు కాని, సినిమాలు కాని కొల్లలుగా వస్తున్న ఈ కాలంలో ఇతివృత్తాన్ని, సంఘటనల్ని, ఆఖరికి పాత్రల స్వభావాన్ని కూడా ప్రతిబింబించేలా ఈ నవల పేరుండడంనిజంగా చాలా గొప్ప విషయం.

శ్రావణంలో మేఘాలు నీటితో నిండి ఇప్పుడో అప్పుడో వర్షించబోయేట్లు వుంటాయి. కాని, అన్ని మేఘాలు వర్షించవు. చల్లగాలికి చెమ్మగిలిన మేఘాలు కొన్ని వర్షిస్తే మరికొన్ని పిల్ల గాలి స్పర్శకు పులకరించి తేలిపోతాయి. అట్లాగే ఈ సినిమా కథలోని పాత్రలూ, సంఘటనలూ వున్నాయి.

శాంతి, లలిత, రాఘవ ముగ్గురూ మూడు జలధారా ప్లావి వారు. ముగ్గురి జీవితాలు తుపాను తాకిడికి అల్లల్లలాడిన శ్రావణ మేఘాలే.

**నేనే శాంతినైతే:** శాంతి ఈ నవలలో ప్రధాన పాత్ర. అమాయిక. తను, తన భర్త, తన కుటుంబమే ఆమె చిన్న ప్రపంచం. తన భర్త తన చుట్టూ అల్లుకు పోవాలని ఆశించే ముద్దరాలైన సాధారణ గృహిణి ఆమె. భర్త డాక్టరు. ఎప్పుడూ రోగుల గురించే ఆలోచించడం అతని వృత్తి ధర్మం. కాని కొంచెం తనకు కూడా గుర్తింపు కావాలని ఆమె కోరిక. ఆ కోరికను మూర్ఖత్వంగా భావించి తానే ఒక మూర్ఖుడై, ఆమె తన జీవితంలోంచి తప్పుకునేలా చేశాడు రాఘవ. ఏది ఏమైనా శాంతిని చూస్తే జాలే తప్ప ద్వేష భావం ఇసుమంతైనా కలుగదు.

ఇప్పుడు శాంతి మరల తన భర్త జీవితంలోకి ప్రవేశించడానికి అనువైన అవకాశం ఏర్పడింది. " కాని నేనే శాంతి స్థానంలో వుంటే ఆ అవకాశాన్ని తిరస్కరిస్తాను."ఎందుకంటే ఎలాగూ నా జీవితంలో భార్య అనే నాటకానికి తెరపడింది. తల్లిగా నూతన జీవితాన్ని ఆరంభించాను. నాకు ఒక లక్ష్యమంటూ ఏర్పడింది. అదే నా బిడ్డను చక్కటి బాటల పయనింప చేసి సరియైన గమ్యాన్ని చేర్చడం. కనుక మూసుకు పోయిన వెనుకటి జీవితపు తెరను తొలగించి నా స్థానంలో ప్రవేశించిన మరొక అమాయిక హృదయాన్ని కల్లోలపరచడం కంటే, ఇలాగే తెరవెనుక జీవితాన్ని గడపడమే ఉత్తమమని నిర్ణయించుకుంటాను. అలా సాధ్యం కాదు. నా భర్త నన్ను కోరుతున్నాడు, నా మనసు అందుకు సిద్ధంగా వున్నది అనిపించినప్పుడు నా బిడ్డను లలితకప్పగించి ప్రాణం తీసుకోవడానికైనా వెనుకంజ వేయను. ఎందుకంటే ఒకప్పుడు నేనున్న పరిస్థితిలోనే లలిత కూడా వుంది కనుక.

ఆనాడు నాది కేవలం అనుమానమే. అనుమానానికే తట్టుకొనలేక సంసారాన్ని త్యజించాను నేను. అప్పుడు నాకు తండ్రి అనే ఆధారం, బిడ్డ అనే ఆలంబన, అంతో ఇంతో తెగింపు వుంది. కాని పాపం లలితకు భర్త తప్ప మరే ఆధారం లేదు. తన జీవితంలో నేను నిజం. అంతే కాదు తాను మానసికంగా చాలా బలహీనురాలు. అందుకే సాటి స్త్రీగా సహృదయంగా ఆమెకెట్టి పరిస్థితిలోనూ అన్యాయం చేయను.

**రాఘవ స్థానంలో నేనే వుంటే:** అసలుఅతనిలా ఎప్పుడూ ప్రవర్తించను. నా వృత్తికి ఎంత ప్రాధాన్యత ఇస్తానో అంతే ప్రాధాన్యాన్ని నా భార్యకు ఇస్తాను. రోజులో ఒక గంట సేపైనా నా కుటుంబం కోసం కేటాయిస్తాను. అమాయకురాలైన భార్యను రెచ్చగొట్టడానికి బదులు బుజ్జగించి నెమ్మదిగా ఆమెకు నచ్చ చెప్పడానికి ప్రయత్నిస్తాను. అంతకూ చెయ్యి దాటిపోతే జీవితాంతం ఒంటరిగా ఆమెకోసం ఎదురు చూస్తానే గాని, మరో స్త్రీకి జీవితంలో తావివ్వను. లలితకు మెల్లగా నచ్చచెప్పి ఆమెకు తగిన వైద్యం చేయించి ఆమె కాళ్ళ మీద ఆమె నిలబడేలా చేస్తానే కాని, ఆమె జీవితాన్ని నా చేజిక్కించుకోను. ఒక వేళ తప్పనిసరి పరిస్థితిలో అలా చేయవలసి వచ్చినా తిరిగి మొదటి భార్యను నా జీవితంలోకి ఆహ్వానించను.

ఈ సినీ నవలలో రాఘవ ఈ విధంగా చేయరాని పనులన్నీ చేసి తనకంటూ అస్తిత్వం లేకుండా చేసికొని ఎటూ చేయలేని అసమర్థుడై పోయాడు. స్త్రీ పాత్రల ముందు రాఘవ పాత్ర చిత్రీకరణ పూర్తిగా తేలిపోయిందని చెప్పాలి.

**నాకు నచ్చిన సంఘటన:** బాబు స్కూలు వార్షికోత్సవ సంఘటన చాలా హృద్యంగా చిత్రీకరింపబడింది. పాత్రలను కలపడానికి ఈ సన్నివేశాన్ని చక్కగా ఉపయోగించుకున్నారు. ఈ సన్నివేశంలోనే పాత్రల స్వభావాన్ని మనం అర్థం చేసుకోవచ్చు. పరాయి బిడ్డకు తండ్రిగా నటించమని కోరిన లలిత ఔదార్యం! తన భర్తే తన బిడ్డకు తండ్రిగా నటించడానికి వచ్చాడని తెలిసి ఏమాత్రం బయటపడని శాంతి గాంభీర్యం, తన మాజీ భార్యను అక్కడ చూచి షాక్ తిని యాంత్రికంగా ప్రవర్తించిన రాఘవ స్వభావం ఇవన్నీ ఈ సంఘటనలో మనకు కన్పిస్తాయి. అంత ఎందుకు నవల ఇతివృత్తం మొత్తం ఈ సంఘటనలోనే తెలిసిపోతుంది. ఒక రకంగా ఈ సంఘటన కథా గమనానికి ప్రాణం పోసిందని చెప్పవచ్చు.

"శ్రావణ మేఘాలు" నాకు నచ్చిన ఉత్తమ సినీ నవల.

శ్రీమతి డి.శర్వాణి, ఒంగోలు